క్లుప్తంగా

పెసర క్వింటా రూ.7,405

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పెసర క్వింటా రూ.7,405 ధర పలికింది. జొన్నలు గరిష్టంగా రూ.4,878, కనిష్టంగా రూ.4,669, వరి (హంస) 1,860 – రూ.1,600, వరి (సోనా) గరిష్టంగా రూ.2,651, కనిష్టంగా రూ.1,705 ధరలు లభించాయి.

నేడు ప్రాణ ప్రతిష్ఠాపన

కృష్ణా: మండలంలోని గుర్జాల్ గ్రామంలో మంగళవారం నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ పాటిల్ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కడేచూర్ పీఠాధిపతి గురుమూర్తి శివచార్య మహాస్వామి, పక్షిమాద్రి విరక్త మఠం పీఠాధిపతి పంచమ సిద్ధలింగ మహాస్వామి, వేద మూర్తి చేగుంట క్షీరాలింగేశ్వర స్వామి వారు పాల్గొంటారని ఆమె తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

వార్షికోత్సవ వేడుకలు

కోస్గి: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు సోమవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని మోమీన్‌పేట్ కేంద్రంలో నిర్వహించిన ఈ వేడుకల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరోజ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జల సంరక్షణ మనందరి బాధ్యత

కోస్గి: 'జల సంరక్షణ.. మనందరి బాధ్యత' అంటూ విద్యార్థులు జల ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు సోమవారం వాక్ ఫర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జల సంరక్షణపై గుండుమాల్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బ్యూలా మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా అవసరమైనంత వరకు వినియోగించుకుంటూ జల సంరక్షణలో అందరం భాగస్వాముల వుదామని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా చింతల రాయస్వామి ఉత్సవాలు



నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో స్వయంభుగా వెలిసిన శ్రీచింతలరాయస్వామి జాతర సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆలయ అర్చకులు వెంకోబాచారి ఇంటి నుంచి పల్లకీసేవ నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా మహిళలు నీళ్లు పోస్తు స్వామివారి ఉత్సవమూర్తికి స్వాగతం పలికారు. హారతులు ఇస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, హారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలు అందించారు.

కమలంలోకి 'విమల'



నారాయణపేట: బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో పాలమూరు లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డీకే అరుణమ్మ సమక్షంలో సోమవారం ధన్వాడ జెడ్పీటీసీ విమల బీఆర్ఎస్‌ను వీడి సొంతగూటికి చేరారు. ఆమెతో పాటు అనుచరులకు అరుణ పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ విమల మాట్లాడుతూ ఢిల్లీలో మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాగరాజ్‌నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, రామచంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాస్, నాయకులు సుంకు ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, నర్సింహులు యాదవ్, సత్యయాదవ్, రఘువీర్ యాదవ్, రఘురామయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మక్తల్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అంకేన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. అంకేన్‌పల్లికి చెందిన శివరాజ్ (32) దంపతులు ఈ నెల 19న గొడవపడ్డారు. అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివరాజ్ పురుగుల మందు తాగడంతో వెంటనే గమినించిన కుటుంబ సభ్యులు మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి సోదరుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

అందుబాటులో లేని టార్పాలిన్లు

- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- జిల్లాలో 105 కేంద్రాల నుంచి 1.35 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుంటున్న రైతులు



లాల్‌కోట చౌరస్తాలో ధాన్యం రాశులపై కప్పిన అద్దె టార్పాలిన్లు

మరికల్: జిల్లా వ్యాప్తంగా యాసంగి వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్న తరుణంలో అన్నదాతలకు అకాల వర్షాల భయం పట్టుకుంది. వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన టార్పాలిన్లు సకాలంలో పంపిణీ చేయకపోవడంతో ఆరబెట్టిన ధాన్యం రాశులు తడిసిపోతున్నాయి. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్న తరుణంలో తూకాలు సరైన సమయంలో కాకపోవడంతో పాటు మారుతున్న వాతావరణ పరిస్థితులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చివరి సమయంలో చేతి రాకుండా పోతుందని వాపోతున్నారురు. తప్పనిసరి పరిస్థితుల్లో ధాన్యాన్ని భద్రపర్చుకునేందుకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద టార్పాలిన్లు అద్దెకు తీసుకోవాల్సిన వస్తుందని అన్నదాతలు అంటున్నారు.

105 కొనుగోలు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 105 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. మొత్తం 1.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 81 టన్నులు కొనుగోలు చేశారు. కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే, ధాన్యాన్ని బట్టి టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. కానీ దాదాపుగా 10 టార్పాలిన్లు మాత్రమే ఇచ్చారు. ఇవి ఏమాత్రం సరిపడవని రైతులు వాపోతున్నారు.

టార్పాలిన్ల కొరత

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ చేస్తున్నారు. కొనుగోళ్లకు అవసరమైన తూకం, తేమ యంత్రాలు, గన్నీబస్తాలు తదితర వాటిని సమకూర్చాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖపై ఉంది. కోతల ప్రారంభానికి ముందే కార్యాచరణ రూపొందించాలి. సీజన్‌కు ముందుగానే మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అరకొరగానే ఏర్పాటు చేస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎండలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నా కొనుగోలు కేంద్రాల వద్ద కనీసం తాగునీటి వసతి కల్పించడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పెద్దచింతకుంటలో వర్షానికి తడిసిన ధాన్యం చూపిస్తున్న రైతు

టార్పాలిన్ల కొరత ఉంది

జిల్లాలో రెండు సీజన్లలో దాదాపు 170 టార్పాలిన్లు పంపిణీ చేశాం. వర్షాకాలం సీజన్‌లో సరఫరా చేసిన వాటిలో 30 నుంచి 40 టార్పాలిన్లు ఉంటాయి. ప్రస్తుతం టార్పాలిన్ల కొరత ఉండడంతో పంపిణీ చేయడం లేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి వస్తే తప్పకుండా రైతులకు అందజేస్తాం.

– భారతి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి, నారాయణపేట

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కూలీలతో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

మద్దూరు: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రెనివట్ల, మోమినాపూర్, అప్పిరెడ్డిపల్లి, అచ్చంపల్లి గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో నీడను ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో కూలీల డబ్బులు 15 రోజుల్లో చెల్లించాలని చట్టంలో ఉన్నా.. పనులు చేసి 8 నుంచి 10 వారాలు గడుస్తున్నా కూలీలకు డబ్బులు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు హన్మంతు, శివకుమార్, అశోక్, సాధు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



కుసుమర్తిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఊట్కూరు: మండల కేంద్రంలో సోమవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరుతూ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఊట్కూరులోని మేయిన్‌బజార్, సర్దార్‌నగర్, శ్రీరాంనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, దళితమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీటీసీ హన్మంతు, విజయకుమార్, శాంతకుమార్, సందీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కుసుమర్తిలో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అరుణ గెలిపిస్తే కేంద్రంలో మంత్రి అవడం ఖాయమని, తద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నర్సప్ప, రాఘవేంద్ర, హన్మంతురాయ, శంకరయ్యశెట్టి, నాగప్ప, మహేష్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీతో పర్యావరణానికి ముప్పు



పోస్టర్ విడుదల చేస్తున్న రైతు మండలి సభ్యులు

మరికల్: ఇథనాల్ కంపెనీతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని కంపెనీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు రామచంద్రయ్య, మహేష్ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో సోమవారం గ్రామ రైతు మండలి ఆధ్వర్యంలో కంపెనీ వ్యతిరేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఇలాంటి కంపెనీలను రాష్ట్రంలో 28 ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల భూమితో పాటు గాలి, నీరు కలుషితం అవుతాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణమే ఇథనాల్ కంపెనీలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు మండలి సభ్యులు రాయప్ప, రామచంద్రయ్య, ఆలీసాబ్, వెంకటప్ప, ఆంజనేయులు, కతల్, పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమిని ఓడించండి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కేజీ రామచందర్



మాట్లాడుతున్న కేజీ రామచందర్

నారాయణపేట: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కేజీ రామచందర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో సంఘం జిల్లా కార్యదర్శి బి.రాము అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించగా కేజీ రామచందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లుగా పాలిస్తున్న మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలను నియంత్రించడంలో విఫలమైందని.. ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు, విద్య, వైద్యంలాంటి హామీలు గుప్పించి అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 12 కోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నరన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మిక హక్కులకు వ్యతిరేకంగా రూపొందించిందని తెలిపారు. విద్య, వైద్యరంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రతిపక్ష నాయకులపై ఐటీ, ఈడీ, సీబీఐని ప్రయోగించి భయానక వాతావరణాన్ని సృష్టిస్తోందని తెలిపారు. అంబానీ, అదానీలకు దేశాన్ని, దేశసంపదను అప్పగిస్తున్నారని.. 80 కోట్ల మందికి ఉచిత బియ్యం సరఫరా చేస్తూ వికసిత భారత్ అనడం సిగ్గుచేటన్నారు. ఫాసిస్టు విధానాలు అనుసరిస్తున్న ఎన్డీఏ కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణ, జిల్లా నాయకుడు కె.కాశీనాథ్, బి.యాదగిరి, ఏ.సలీం, జయలక్ష్మి, కిరణ్, కాశేశ్వర్, రాము, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కోస్గి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోస్గిలోని పంచాక్షరీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వెళ్తున్న పెన్షనర్లకు ఆస్పత్రుల్లో రూ.లక్షలు చెల్లించాల్సి వస్తుందని, ప్రభుత్వం నగదు రహిత వైద్య సేవలు అందించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు పూర్తిస్థాయిలో ఈహెచ్ఎస్ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లు చెల్లించాలని, ప్రతినెల 1వ తేదీన పెన్షన్ చెల్లించాలని, ఇతర డిమాండ్లపై ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేయగా పార్లమెంట్ ఎన్నికల తర్వాత పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందన్నారు. అనంతరం సీఏ జయప్రకాష్ రెడ్డి పెన్షనర్ల ఇన్‌కం ట్యాక్స్‌కు సంబంధించిన సమస్యలు, ఇతర అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మనోహర్ ప్రసాద్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు విశ్వాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతు చేపట్టండి



కంకర వేసి వదిలేసిన మక్తల్, గద్వాల్ రహదారి

నర్వ: మండలంలోని ప్రధాన రహదారులకు మరమ్మతు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. నర్వ నుంచి రాంపూర్ గేట్ వరకు, రాంపూర్ గేట్ నుంచి మరికల్ ప్రధాన రహదారి, యాంకి నుంచి పెద్దకడ్మూర్ వరకు బీటీ రహదారులు పూర్తిగా గోతులు పడి ప్రయాణానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. గొన్నేళ్లుగా మరమ్మతు చేపట్టకపోవడంతో ఈ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు మక్తల్ నుంచి గద్వాల వెళ్లే ప్రధాన రహదారిపై కొన్ని రోజుల క్రితం కాంట్రాక్టర్ కంకర పర్చి బీటీ వేయకుండా వదిలేశారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు దుమ్మును భరించలేకపోతున్నామని వాపోతున్నారు. ఈ రహదారిని వెంటనే పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత 'మద్దూరు'



విజేతగా నిలిచిన మద్దూరు వాలీబాల్ జట్టు

మరికల్: ఉమ్మడి జిల్లా వాలీబాల్ బాలుర టోర్నమెంట్ విభాగంలో మద్దూరు జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం రాత్రి 12 గంటలకు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో షాద్‌నగర్, మద్దూరు టీంల మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఈ పోటీలో మద్దూరు రెండు సెట్లు, షాద్‌నగర్ ఒక సెట్‌లో గెలుపొందడంతో మద్దూరును విజేతగా ప్రకటించి రూ. 50 వేలు, రెండో విజేత షాద్‌నగర్ రూ.35 వేలు, మూడో విజేతకు పడికల్ జట్టుకు రూ.15 వేలతో పాటు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో రాజేష్, బాల్‌రాజ్, రవికిరణ్, నర్సిములు, ఫరుక్, పీఈటీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంతో పాటు అన్ని పట్టణ, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించే హనుమాన్ జయంతి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ యోగేష్‌గౌతమ్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు మండల, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 79చోట్ల జరిగే శోభాయాత్ర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్వాహకులు నిబంధనలు పాటించే విధంగా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పీఎస్‌ల ఎస్‌హెచ్‌ఓలకు సూచించామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు సూచించిన మార్గంలో ఎడవైపుకు ర్యాలీలు చేపట్టాలని, డీజేలు వాడరాదని, టపాకాయలు కాల్చరాదని కోరారు. జెండా కర్రలు 2అడుగులకు మించరాదని, మద్యం, మత్తు పదార్థాలు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శోభాయాత్రను పూర్తిగా సీసీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షిస్తామన్నారు.

గురుకుల విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మాగనూర్: మండలంలోని తళంకేరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన గాయత్రి అనే విద్యార్థిని గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుల నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినితో పాటు తండ్రిని ఘనంగా సన్మానించారు. నోడల్ అధికారి వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బలరాం, నర్సింహారెడ్డి, సీఆర్పీ ఎల్లగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ బాలప్ప, గ్రామస్తులు రామకృష్ణ, శ్యాంసుందర్, నర్సిములు, సుగురు బాలప్ప, రాజు, మహేష్, చిన్న నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి



విద్యార్థులకు పాస్‌అవుట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ అందజేస్తున్న డీఈఓ అబ్దుల్

ధన్వాడ: వేసవి కాలంలో నీటి కొరత ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రతి ఒక్క విద్యార్థి నీటి వృథాపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌ఘనీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ కేడబ్ల్యూ విద్యార్థుల పాస్ అవుట్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సేవ్ వాటర్ సేవ్ నేషన్ అనే నినాదంపై వీలైనంత ఎక్కువగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యాక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, ఎస్ఓ నాగార్జునరెడ్డి, హెచ్ఎం రమేష్ శెట్టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీలకు రైతులపై చిత్తశుద్ధి లేదు'



మట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

ధన్వాడ: శాసనసభ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో ఆచరణ కానీ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలకులకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం నేర్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఎన్నికల సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సందర్భంగా డిసెంబర్ 9వ తేదీన రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన పాలకులు రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీకి రైతులపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే రైతు రుణమాఫీ చేసేదని, రైతుల ఓట్లపైనే వారికి ప్రేమ ఎక్కువ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అటకెక్కిస్తుందని దుయ్యబట్టారు. బీజేపీ నాయకులు శ్రీరాముడి పేరుతో ఓట్లు దండుకునేందుకు సిద్ధం అయ్యారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి మన్నెం శ్రీనివాస్‌రెడ్డిని తిరిగి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వహీద్, నాయకులు అబ్దుల్ సలీం, రాయవర్ధన్‌రెడ్డి, బాలరాజు, సునీల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, సుదర్శన్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



చిన్నపొర్లలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి

మాగనూర్: హర్ ఘూమ్‌-ఏక్ గంటే కార్యక్రమంలో భాగంగా సోమవారం మాగనూర్ మండలంలోని పలు గ్రామాల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పర్యటించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఉదయం మాగనూర్‌లో పర్యటిస్తూ అందరినీ అప్యాయంగా పలకించిన ఎమ్మెల్యే చివరికి గ్రామీణ వికాస్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ గెలిస్తే మన జిల్లా బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శక్తి ఢిల్లీకి తెలిస్తుందన్నారు. ముఖ్యంగా వంశీచందర్‌రెడ్డిని గెలిపిస్తే మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నర్సింహారెడ్డి, శివరాంరెడ్డి, వాకిటి శ్రీనివాసులు, ఉజ్జెల్లి కృష్ణయ్య, వేణు, గడ్డం వెంకటయ్య, గడ్డం నరేష్, చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

కోస్గి: నియోజకవర్గంలోని మద్దూర్ మండలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి సూచించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్దూర్‌లో సీఎం పార్టీ నాయకులు, కార్యకర్తల మీటింగ్ ఉంటుందని, అనంతరం బాహోజీ జాతర సందర్భంగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, నాయకులు అన్న కిష్టప్ప, భీంరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

చిన్నపొర్లలో కాంగ్రెస్ చేరికలు..

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్లలో సోమవారం మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డు మాజీ సభ్యులు, ఆయన అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, బసవరాజుగౌడ్, సత్యనారాయణరెడ్డి, దుర్గం శ్రీనివాస్, సూర్యప్రకాష్‌రెడ్డి, లింగం, విజ్ఞేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీలేర్‌లో..

మరికల్: మండలంలోని తీలేర్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు 150 మందికి పైగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సమీక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో చేసిన అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవతమ్మ, కుర్మన్న, భజరప్ప, ఆంజనేయులు, సునీత, రాజు, వెంకట్‌రెడ్డి తధితరులు పాల్గొన్నారు.



కోస్గిలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి..



తీలేరులో..